నమస్తే తెలంగాణ

# రంగారెడ్డి

I | హైదరాబాద్, మంగళవారం 3 జూన్ 2025 | RANGAREDDY


- వికారాబాద్ కలెక్టరేట్‌లో శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ .. రంగారెడ్డి కలెక్టరేట్‌లో వేం నరేందర్‌రెడ్డి జాతీయ జెండాల ఆవిష్కరణ
- అర్హులకు పథకాలు అందిస్తామని స్పీకర్ వెల్లడి
- రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి అని అన్న వేం నరేందర్‌రెడ్డి
- అమరవీరుల స్తూపాలకు ఘన నివాళి



# అంబరాన్నంటిన ఆవిర్భావ సంబురం

**ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో వైభవంగా వేడుకలు**



వికారాబాద్ కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి.. వందనం చేస్తున్న శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎమ్మెల్యేలు



రంగారెడ్డి కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించి.. వందనం చేస్తున్న ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు వైభవంగా సాగాయి. వికారాబాద్ కలెక్టరేట్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, రంగారెడ్డి కలెక్టరేట్‌లో ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్ రెడ్డి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని బీఆర్ఎస్ కార్యాలయాల్లో పార్టీ శ్రేణులు జాతీయ జెండాలతోపాటు బీఆర్ఎస్ జెండాలను కూడా ఆవిష్కరించారు. తెలంగాణ సాధనకోసం అమరులైన వారిని స్మరించుకుని ఘన నివాళులర్పించారు.

### అర్హులకు పథకాలు అందిస్తాం..

వికారాబాద్, జూన్ 2 : సంక్షేమ పథకాల అమలుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని శాసనసభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి..జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిధి పెంపు, భూభారతి తదితర పథకాల గురించి వివరించారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలను ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన వీక్షించారు. అంతకుముందు వికారాబాద్ పట్టణ కేంద్రంలోని అమరవీరుల స్తూపానికి జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రసాద్‌కుమార్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, అదనపు ఎస్పీ హనుమంతరావు, ఆర్డీవో వాసుచంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### రాష్ట్రాభివృద్ధే.. అమరులకు అసలైన నివాళి

ఆదిబట్ల : రాష్ట్ర అభివృద్ధే అమరులకు అసలైన నివాళి అని ముఖ్యమంత్రి సలహాదారు (ప్రజా వ్యవహారాలు) వేం నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ఆవిర్భావ వేడుకను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించి.. జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాల పునాదులపై, పోరాడి సాధించుకున్న తెలంగాణ.. నేడు అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నదన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం స్ఫూర్తితో తెలంగాణ ప్రగతిలో అన్ని వర్గాల ప్రజలు మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్సు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం పరిధి పెంపు, భూభారతి తదితర పథకాల గురించి వివరించారు. కాగా అవతరణ వేడుకలను పురస్కరించుకుని కలెక్టరేట్ ఆవరణలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరింపజేశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆయన జ్ఞాపికలను అందజేశారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై వివిధ శాఖలు ప్రదర్శించిన శకటాలను వీక్షించారు. అదేవిధంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పలువురు రైతులకు నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. అంతకుముందు కలెక్టరేట్ ఆవరణ లో అమరవీరుల స్మారక స్తూపం వద్ద వేం నరేందర్‌రెడ్డి, కలెక్టర్ నారాయణరెడ్డి, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, శంకర్, ఆర్డీవో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంతరెడ్డి, అధికారులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో రాష్ట్ర పట్టణ, ఆర్థిక, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




వికారాబాద్ : బీఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జెండాను ఆవిష్కరించిన వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్



బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంపై జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కిషన్‌రెడ్డి



పరిగిలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



షాద్‌నగర్ : బీఆర్ఎస్ కార్యాలయం వద్ద గులాబీ జెండాను ఆవిష్కరించిన మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



వికారాబాద్ : అమరవీరుల స్తూపం వద్ద కొవ్వొత్తులు వెలిగించిన బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు శుభప్రద్ పటేల్ తదితరులు





## తెలంగాణ సాధకుడికి.. కృతజ్ఞతగా

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం శేరిలింగంపల్లిలోని ఎల్లమ్మబండలో స్థానిక బీఆర్ఎస్ నాయకుడు ఎర్రబెల్లి సతీశ్‌రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ సాధకుడైన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రామస్వామి, జీవన్ రెడ్డి, సమద్, జగదీశ్, రాజు, జనార్దన్ రావు, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

**- సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ)**



## తెలంగాణ భవన్‌లో ...


తెలంగాణ భవన్‌లో రాష్ట్ర అవతరణ దినోత్సవం సంబురంగా జరిగింది. పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరాగా మండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, ఎమ్మెల్యే వివేకానంద్, నేతలు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తుల ఉమ తదితరులు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**పిల్లలు చదువు 'కొనే'దెలా?**

# ప్రీ ప్రైమరీకి 2 లక్షలు

- ప్రతి ఏడాది పెరిగిపోతున్న ఫీజులు
- లక్షల్లో వసూలు చేస్తున్న ప్రైవేటు బడులు
- నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్ దందాలు
- తల్లిదండ్రులపై భారం
- విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ కమిటీల ఆగ్రహం

**'అది హిమాయత్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్. ఎల్‌కేజీలో తన కూతురిని చేర్పించేందుకు ప్రకాశ్ అనే తండ్రి వెళ్లాడు. ఫీజు రూ. 95వేలు అంటూ యాజమాన్యం చెప్పింది. ఎల్‌కేజీకి అంత ఫీజు ఎందుకు ఉంటుందని అడిగితే.. మా స్కూల్‌లో ఫీజులు అంతే ఉంటాయి. మీకిష్టముంటే చేర్పించండి. మా స్కూల్లో అడ్మిషన్ల కోసం పోటీపడతారు.' స్కూల్ యాజమాన్యం అలా చెప్పడంతో అవాక్కవడం ఆ తండ్రి వంతైంది. ఫీజుల ప్రక్రియలో ఓ విధానం లేకపోవడంతో ఆ తండ్రి ఏం చేయాలో తెలియక ఇంటికొచ్చేశాడు.**



సిటీబ్యూరో, జూన్ 2 ( నమస్తే తెలంగాణ) : మరో పది రోజుల్లో పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. తల్లిదండ్రులకు పాఠశాలల నుంచి ఫోన్లు వస్తున్నాయి. 'మీ పిల్లల ఫీజులు చెల్లించండి.. యూనిఫాం, బుక్స్ వచ్చాయి. యాప్‌లు ఇన్‌స్టాల్ చేసుకోవాలి. డబ్బులు చెల్లించి వాటిని తీసుకొండి.' అంటూ చెబుతున్నారు. అంతే కాదు ఫస్ట్ టర్మ్ ఫీజు స్కూల్ ప్రారంభం రోజునే చెల్లించాలని షరతులు విధిస్తున్నారు. ఇక గతంలో ఫీజు బకాయిలు ఉన్న పేరెంట్స్‌కు మరో స్కూల్ చూసుకోండి అంటూ బెదిరిస్తున్నారు. చదువులు చెప్పే పాఠశాలలు ఇప్పుడు డబ్బులు వసూలు చేసే వ్యాపార కేంద్రాలుగా మారాయంటూ విద్యార్థి సంఘాలు, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకే తరగతి చదువుకు సెక్షన్ల పేర్లు పెట్టి.. అదనపు సిలబస్ బోధిస్తామంటూ రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### లక్షలపైనే దృష్టి..!

పాఠశాల అంటే చదువుల తల్లి కొలువుండే ప్రదేశంగా అందరూ భావిస్తుంటారు. భావిభారత పౌరులను సన్మార్గంలో నడిచేలా తీర్చిదిద్దే వేదికలు అవి. కానీ, ఇప్పుడు నగరంలోని పాఠశాలలు వ్యాపార కేంద్రాలుగా మారాయి. ఎంత ఫీజు ఎక్కువగా ఉంటే అంత మంచి స్కూల్‌గా నిర్వచిస్తున్న పరిస్థితులు దాపురించాయి. రాంనగర్‌లోని ఓ ప్రయివేట్ స్కూల్‌లో ఎల్‌కేజీకి రూ.35వేలు ఉండగా.. బంజారాహిల్స్‌లోని ఇదే ఎల్‌కేజీకి రూ. 1,20,000గా ఉన్నది. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు ఏ స్కూలైనా ఏడాది చదువుకు లక్ష రూపాయలకు పైగా తల్లిదండ్రులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి నెలకొన్నది. కనీసం నోటీసు బోర్డుపై ఏ క్లాస్‌కు ఎంత ఫీజు వసూలు చేస్తామో కూడా తెలపకుండా వారికి నచ్చినట్టుగా ఫీజులు వాళ్లే నిర్ణయించేస్తున్నారు. గ్రేటర్‌లోని పాఠశాలల్లో ఎల్‌కేజీకి వసూలు చేస్తున్న ఫీజులు.. ఇంజినీరింగ్, మెడిసిన్, డెంటల్‌కాలేజీలు ఫీజుల కన్నా అధికంగా ఉన్నాయి. ఇంజినీరింగ్‌లో గరిష్ఠంగా అధికంగా రూ. 2.15 లక్షల ఫీజు ఉంటే.. ఓ పాఠశాలలో ప్రీ ప్రైమరీకి రూ.2.10 లక్షలు వసూలు చేస్తున్నారు. ఫీజుల కట్టడిపై జిల్లా విద్యాశాఖ అధికారులకు ఎలాంటి నియంత్రణ ఉండకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

### అధికారుల పర్యవేక్షణేదీ?

అంతర్జాతీయ ప్రమాణాలు అని చెప్పుకొంటున్న పాఠశాలల్లో ప్రమాణాలు సాధారణ పాఠశాలల మాదిరిగానే ఉంటున్నాయని విద్యావేత్తలు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ పరిధిలో ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు 773 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలున్నాయి. మరో 3,500 వరకు ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలున్నాయి. చాలా విద్యాసంస్థలు ఇంటర్నేషనల్ స్కూళ్ల పేరుతో రాజ్యమేలుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా దర్జాగా బోర్డులు తగిలించుకొని దందా చేస్తున్నాయి. సీఐఎస్(కౌన్సిల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్కూల్స్) గుర్తింపు ఉన్న బడులు మాత్రమే ఇంటర్నేషనల్ బోర్డులు తగిలించుకోవాలి. ఈ గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న బడులను ఆ సంస్థ పరిశీలించి ఆమోదం తెలుపుతుంది. గ్రంథాలయాలు, ప్రయోగశాలలు ఇలా 25 అంశాలను పరిగణనలోకి తీసుకుని గ్రేడింగ్స్ జారీ చేస్తుంది. కానీ నగరంలోని చాలా స్కూళ్లు గుర్తింపులేకున్నా ట్యాగ్ తగలించుకుంటున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారించి ఫీజుల నియంత్రణను చర్యలు తీసుకోవాలని పేరెంట్స్ డిమాండ్ చేస్తున్నారు.



## వచ్చే రెండ్రోజులు వర్షాలు

సిటీబ్యూరో : సోమవారం నగరంలో పలు చోట్ల తేలికపాటి జల్లులు కురిశాయి. అల్లాపూర్, బాలానగర్, కూకట్‌పల్లి, నేరేడ్‌మెట్, చర్లపల్లి, కుషాయిగూడ తదితర ప్రాంతాల్లో తేలికపాటి వాన కురిసింది. మరోవైపు ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 32.8 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 24.4 డిగ్రీలు, గాలిలో తేమ 61%గా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. కాగా కింది స్థాయి గాలుల ప్రభావంతో రాగల 2 రోజుల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురుస్తాయన్నారు.